క్లుప్తంగా

పాఠశాలలో ఎంఈఓ తనిఖీ



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ బాలాజీ తనిఖీ చేశారు. ఇటీవల మండలంలో ఏడు పాఠశాలలు పీఎం శ్రీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, ఆయా అప్లికేషన్ల వివరాలను మంగళవారం ఎంఈఓ పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయులు, ఎలక్ట్రిసిటీ, టాయిలెట్, కిచెన్ గార్డెన్, లైబ్రరీ తదితర విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు శ్రీకాంత్, రాములు, హెచ్‌ఎం భారతి, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు తైబజారు వేలం

ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో ప్రతి మంగళవారం నిర్వహించే సంత కోసం తైబజారు వేలం ప్రకటన గ్రామ పంచాయతీ అధికారులు విడుదల చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిబంధనలకు అనుగుణంగా తైబజారు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



దామరగిద్ద: మండలంలోని ఉల్లిగుండం గ్రామంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్థానిక మాజీ ఎంపీటీసీ కిషన్‌రావు జర్సీలను అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



కొత్తపల్లి: మండలంలోని దుప్పటి గట్టుతండా, వాల్యానాయక్ తండాల్లో కోస్గి ఎక్సైజ్ అధికారులు, మహబూబ్‌నగర్ (డీటీఎఫ్)ప్రత్యేక టీం సభ్యులు మంగళవారం దాడులు నిర్వహించారు. మద్దూరు మండలంలోని మేడికుంట తండాలో సారాయి తయారీ కోసం నిల్వ ఉంచిన 100 లీటర్ల బెల్లం పానకం, 2 లీటర్ల సారాయి పట్టుకొని పారబోశారు. నిబంధనలకు విరుద్ధంగా సారాయి తయారు చేస్తున్న కమలాబాయిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జబ్బార్ తెలిపారు. మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'సారా కట్టడికి కదిలిన ఎక్సైజ్ అధికారులు' అని రావడంతో యంత్రాంగం పలు తండాల్లో దాడులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై కోస్గి సీఐని వివరణ కోరగా సారాయి తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక టిప్పర్ సీజ్

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామం నుంచి మంగళవారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతి లేకుండా కర్ణాటకకు తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న తమ సిబ్బందికి రాష్ట్ర సరిహద్దులోని చేగుంట వద్ద ఇసుక టిప్పర్‌ను గుర్తించి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సొంత డబ్బుతో శ్మశాన వాటికలో పనులు



మక్తల్: ప్రతి ఒక్కరూ పుట్టిన ఊరికి సేవ చేయాలనే తపన ఉన్న కొందరే ఉంటారు. మక్తల్‌కు చెందిన డీడీఎల్ ఫౌండేషన్ అధినేత ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడు దాచేపల్లి శరత్‌బాబు తన సొంత డబ్బులు రూ.25 లక్షలతో మక్తల్‌లో శ్మశాన వాటికలో పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు పనులు చేశారు. శ్మశాన వాటిక స్థలంలో దహన సంస్కరాల వాటిక, కాంపౌండ్ వాల్, స్నానపు గదులు, అస్థికలు భద్రపరిచేందుకు లాకర్లు, కాటికాపరి రూమ్‌ల కోసం భూమి పూజ చేశారు. ఆయనను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మక్తల్ మాజీ ఉపసర్పంచు కట్టసురేష్, హేమసుందర్, తిరుపతి, అశోక్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తయ్యేనా?



మక్తల్‌లో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ నిర్మాణ పనులు

- దిమ్మెలకే పరిమితమైన పనులు
- రూ.2 కోట్లతో పనులు పూర్తి
- నిధులు లేక నిలిచిన నిర్మాణం
- రూ.3.40 కోట్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఇబ్బందుల్లో చిరువ్యాపారులు

మక్తల్: మక్తల్లో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపడితే అన్ని ఒకే దగ్గర కూరగాయలు, మాంసం మార్కెట్ ప్రజలకు అన్ని సౌకర్యాలు ఉంటాయన్న ఆలోచనతో నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి మక్తల్ మున్సిపల్ పరిధిలో పనులు ప్రారంభించింది. కూరగాయలు మార్కెట్, మాంసం మార్కెట్ నిర్మాణానికి దాదాపు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. గతంలో మార్కెట్ లేకపోవడంతో



ఎండలో కూర్చొని కూరగాయలు అమ్ముతున్న చిరువ్యాపారులు

వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. దీన్ని గమనించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మంజూరైంది. కాంట్రాక్టర్ నిర్మాణ పనులు పిల్లర్స్ వరకు పూర్తి చేసి చేతులెత్తేశారు. దీంతో అసంపూర్తిగా నిర్మాణం ఆగిపోయింది. చిరువ్యాపారులు మార్కెట్ షెడ్లు లేకపోవడంతో ఎండలో కూర్చొని వ్యాపారం చేసుకుంటున్నారు. ఆదివారం సంత రోజు చిరువ్యాపారుల ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలంటే ఇంకా రూ.3.40 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో మార్కెట్ లేక చిరువ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

చిరువ్యాపారులకు వసతులు కల్పించాలి



మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటిగ్రేటెడ్, సమీకృత కూరగాయల మార్కెట్ పనులు వెంటనే పూర్తి చేయాలి. చిరువ్యాపారులు ఎండలో కూర్చొని అమ్ముకుంటున్నారు. వారి ఇబ్బందులు గమనించి చర్యలు తీసుకోవాలి. నిధులు వెంటనే మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలి

– రామాంజనేయులుగౌడ్, మక్తల్

ఇంటిగ్రేటెడ్ నిర్మాణం పూర్తి చేయాలి



మక్తల్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలి. ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కారం చేయాలి. చిరువ్యాపారులు అధికంగా ఉండటంతో నిర్మాణానికి నిధులు లేక కాంట్రాక్టర్ పనులు వదిలేసి వెళ్లిపోయాడు. అధికారులు చొరవ తీసుకొని మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– నర్సింహులునాయుడు, మక్తల్

నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం..

ఇంటిగ్రేటెడ్ నిర్మాణానికి రూ.2 కోట్లు ఖర్చయ్యాయి. పనులు అసంపూర్తి దశలో ఉన్నాయి. నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుంటాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– శంకర్‌నాయక్, మున్సిపల్ కమిషనర్, మక్తల్

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

నారాయణపేట ఎడ్యుకేషన్: నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వాక్ ఫర్ వాటర్ వలంటీర్ వీరు మల్లేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, గ్లోబల్ వార్మింగ్, పారిశ్రామికీకరణ, జనాభా పెరుగుదల వంటి సవాళ్లతో నీటి వినియోగం పెరగడం, నీటి సంరక్షణలో బాధ్యత లేకపోవడం వల్ల భవిష్యత్ తరాలకు నీరు అందని ద్రాక్షలా మిగిలే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమాజంలోని ప్రతి ఒక్కరూ విజ్ఞతతో నీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. వారం రోజుల పాటు జరిగే జల ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగంగా మంగళవారం డీఈఓ గోవిందరాజులుతో నీటి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రస్తుత పరిస్థితుల్లో చేయడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్, సీఎంఓ రాజేంద్ర కుమార్, ఎస్‌ఓ నాగార్జున, ఉపాధ్యాయులు శేఖర్, భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు విన్నవిస్తున్న కార్మికులు

నారాయణపేట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న స్వచ్ఛ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ భోగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు కమిషనర్‌కు తెలిపారు. నాలుగేళ్లుగా చెత్తను సేకరించే ఆటో డ్రైవర్లుగా, పార్కు, డీవైడర్ మొక్కల సంరక్షణ కార్మికులుగా పని చేస్తున్న 20 మంది స్వచ్ఛ కార్మికులకు కనీస వేతనం కాంట్రాక్టర్ చెల్లించడం లేదన్నారు. పీఎఫ్ అమౌంట్ కార్మికుల ఖాతాల్లో రెగ్యులర్‌గా జమ చేయట్లేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల లాగా స్వచ్ఛ కార్మికులకు యూనిఫామ్స్, సబ్బు, నూనెలు ప్రభుత్వ నుంచి అందించాలని కోరారు. తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని, తన పరిధిలో లేని సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మున్సిపల్ కోశాధికారి కేసాయిలు, స్వచ్ఛ కార్మికులు బాలు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వాయిదా పడిన షాపింగ్ కాంప్లెక్స్ వేలం



అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

ధన్వాడ: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అద్దెకు కొనసాగుతున్న దుకాణసముదాయ వేలం మంగళవారం వాయిదా పడింది. ధన్వాడ ప్రత్యేక అధికారి సాయిప్రకాష్, మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. జిల్లా అధికారులు లేకుండా ఎలా వేలం వేస్తారని కొందరు, ప్రస్తుత అద్దెదారులు, వేలం వేయాలని కొందరు అధికారులపై వత్తిడి చేయడంతో షాపింగ్ కాంప్లెక్స్ వేలం వాయిదా పడింది. దీంతో దరఖాస్తు చేసుకున్న వారు షాపులు వేలం వేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జిల్లా పంచాయతీశాఖ అధికారి ట్రైనింగ్‌లో ఉన్నందున ఆయన వచ్చిన తరువాత మరో తేదీ ప్రకటించి వేలం నిర్వహిస్తామని వారు తెలిపారు.

తైబజారు రూ.2.75 లక్షలు

ధన్వాడలో ప్రతి గురువారం నిర్వహించే తైబజారు కోసం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన ద్యావరి రాజుగౌడ్ రూ.2.75లక్షలకు వేలంలో దక్కించుకున్నాడు. పదేళ్లుగా వేలంలో పాల్గొని తైబజారును కైవసం చేసుకోవడం గమనార్హం.

వీఓఏల ముందస్తు అరెస్టు



మాగనూర్: చలో హైదరాబాద్‌లో భాగంగా మాగనూర్ మండలం నుంచి బయలుదేరిన వీఓఏలతో పాటు వారికి మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పి.ఆంజనేయులు మాట్లాడారు.అధికార కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో వీఓఏలకు రూ.20 వేలు జీతం ఇస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు పాల్గొన్నారు.

దుస్తుల తయారీ ఎస్‌హెచ్‌జీలకు అప్పగించాలి



మాట్లాడుతున్న సీఎంఓ రాజేందర్‌కుమార్

దామరగిద్ద: వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్స్ తయారీకి స్వయం సహాయక సంఘాలకు అందించాలని సీఎంఓ రాజేందర్‌కుమార్, ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. మండలంలోని విద్యార్థుల సంఖ్యకు సరిపడ ఒక జత యూనిఫాం తయారీకి బట్టను అందించినట్లు తెలిపారు. నాణ్యతగా కుట్టి అందించాలని మహిళా సంఘాల సభ్యులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎండీఎం కో ఆర్డినేటర్ యాదయ్యశెట్టి, జీహెచ్‌ఎం అశోక్, ఏపీఎం నర్సింహులు ఎచ్‌ఎంలు సీఆర్‌పీలు మహిపాల్, రాములు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శన పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న థియేటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీకాంత్, ట్రైనర్ బుగ్గప్ప

మద్దూరు: మండలంలోని నాగంపల్లిలో ఈ నెల 26 నుంచి 30 వరకు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటక ప్రదర్శన పోస్టర్‌ను మంగళవారం ట్రెడిషనల్ ఫోక్ థియేటర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సింగర్, రచయిత కాండం శ్రీకాంత్, నాటక ప్రదర్శన ట్రైనర్ బుగ్గప్ప, పాత్రధారులతో కలిసి విడుదల చేశారు. గ్రామంలో బీజేపీ థియేటర్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 4నెలల పాటు ట్రెడిషనల్ ఫోక్ థియేటర్ బయిలాట వర్క్‌షాప్ నిర్వహించినట్లు తెలిపారు. 27న ప్రపంచ నాటకరంగ దినోత్సవాన్ని పురస్కరించుకోని ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచితంగా ప్రదర్శించే ఈ నాటకాన్ని మండల ప్రజలు ఆదరించాలని పేర్కొన్నారు.

రైలు వేళలు మార్చాలని ఎంపీకి వినతి



మక్తల్: మక్తల్, జక్లేర్, దేవరకద్ర డెమో రైలు వేళలు మార్చాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు మక్తల్ నియోజకవర్గ సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్‌గౌడ్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. దక్షిణ మధ్య రైల్వే వారు ఆరు నెలల క్రితం కాచిగూడ నుంచి దేవరకద్ర మీదుగా (కాచిగూడ–రాయచూర్) జక్లేర్, మక్తల్, కృష్ణ, రాయచూర్‌కు డెమో రైలు ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రయాణికులకు నిరుపయోగంగా ఉందని, తక్షణమే రైలు వేళల్లో మార్పులు చేసి మరిన్ని ప్యాసింజర్ రైళ్ల నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ డెమో రైలు హైదరాబాద్ –కాచిగూడ నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి జక్లేర్, మక్తల్‌కు మధ్యాహ్నం 2,3గంటల మధ్యలో వస్తుందన్నారు. తిరిగి రాయచూర్ నుంచి సాయంత్రం 4గంటలకు బయలు దేరి రాత్రి 9, 10 గంటలకు కాచిగూడ చేరుతుందన్నారు. ఉదయం 6గంటలకు కృష్ణ నుంచి మక్తల్, జక్లేర్ మీదుగా బయలు దేరితే మధ్యాహ్నం వరకు హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. వెంటనే రైలు వేళలు మార్చాలని కోరారు.

28న సింగిల్‌విండో మహాజన సభ



నర్వ పీఏసీఎస్‌లో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్

నర్వ: ఈ నెల 28న, మండల సింగిల్ విండో మహాజన సభను నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024–25 వార్షిక సంవత్సరానికి సంబంధించి పీఏసీఎస్ నివేదికపై సభలో చర్చిస్తామన్నారు. మండల పీఏసీఎస్ పాలకవర్గ డైరెక్టర్లు, మండల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనాలని కోరారు.

నేటితో కందుల కొనుగోలుకు బ్రేక్

జనవరి 30 నుంచి మండల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించిన కందుల కొనుగోలు కేంద్రాన్ని నేటి నుంచి బంద్ చేయనున్నట్లు చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బుధవారం పీఏసీఎస్ కార్యాలయంలో సీఈఓ ఉదయ్ ఇంకా విక్రయించుకోని రైతులకు టోకెన్లు అందిస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని టోకెన్లు తీసుకోవాలన్నారు. టోకెన్‌లు తీసుకున్న రైతుల నుంచి మరో వారం రోజుల పాటు కందులు కొనుగోలు చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో కేవలం ఒక్క రోజు మాత్రమే టోకెన్‌లు ఇచ్చేందుకు పాలకవర్గం నిర్ణయించిందన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు



జాతీయ రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేయించిన ఎస్‌ఐ ఎండీ నవీద్

కృష్ణా: మండలంలోని జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. మంగళవారం తైరోడ్డులోని కూడలితో పాటు గుడెబల్లూర్, హిందుపూర్, కుస్సీ గ్రామాల్లోని చౌరస్తాల్లో ఈ బారి కేడ్లు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఈ బారికేడ్లపై రాత్రి సమయాల్లో రెడ్ లైట్స్ వెలుగుతాయని, అప్పుడు వాహనదారులు సులబంగా వీటిని గుర్తించుటకు అవకాశం ఉంటుందన్నారు. ప్రయాణికులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తైరోడ్డుకు చెందిన నాయకులు ఉన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి



మక్తల్ అంబేడ్కర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

సాక్షి, నెట్‌వర్క్: ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అంబేడ్కర్ చౌరస్తాలో ఆశాలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోవిందురాజ్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గోవిందమ్మ, యశోదమ్మ, పార్వతమ్మ, లక్ష్మి, రేణుక, రక్షిత, సావిత్రమ్మ, అమీనాబేగం, ఇందిర, అనిత, పార్వతమ్మ, వెంకటలక్ష్మి, వెంకటమ్మ, సుజాత, పద్మ, లక్ష్మి, రశీద, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాగనూర్‌లో..

- మాగనూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తాలో ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు.
- ఊట్కూరు, పులిమామిడి పీహెచ్‌సీ ముందు సీయూటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనంతోపాటు ఈఎస్‌ఐ, పీఎఫ్ కల్పించాలన్నారు.
- మరికల్ మండల కేంద్రంలో ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఆశా కార్యకర్తలను ప్రభుత్వం అరెస్టులు చేయించడం హేయమైన చర్యఅని పేర్కొన్నారు.



ధన్వాడలో..

- ధన్వాడ మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ వద్ద ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ మాట్లాడారు. శాంతి, మంగమ్మ, యాదమ్మ, మాసమ్మ, చంద్రకళ, సుజాత పాల్గొన్నారు.
- కోస్గి మండలంలోని గుండుమాల్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. అనంతరం మండల తహసీల్దార్ భాస్కరస్వామికి వినతిపత్రం అందజేశారు.



కోస్గి తహసీల్దార్ భాస్కరస్వామికి వినతి పత్రం అందిస్తున్న ఆశా కార్యకర్తలు

- నారాయణపేట మండలంలోని కోటకొండలో ఆశా కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాధిక, భాగ్య, పద్మ, అంజమ్మ, నరసమ్మ, కృష్ణవేణి, కల్పన, జయమ్మ, వెంకటేశ్వరి, రేణుక పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



మాగనూర్: మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన మురళీధర్‌రెడ్డిని మండల ఉపాధ్యాయులు ఎంఆర్సీ కార్యాలయం వద్ద శాలువా, పూలమాలతో సన్మానించారు. తాను ఎంఈఓగా బాధ్యతలు చేపట్టేందుకు కృషి చేసిన వారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వినోద్‌కుమార్, వెంకటేష్, తిమ్మన్న, తిరుపతి, శ్రీనివాసులు, బలరాం, నర్సింహరెడ్డి, నరేష్, మౌనిక, సీఆర్పీలు ఎల్లాగౌడ్, కృష్ణ, స్వప్న పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్వోవాటర్ ప్లాంట్ వితరణ

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు దాత మహానందీశ్వర్ అందజేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం హెచ్‌ఎం నాగరత్నమ్మ ప్రారంభించారు. విద్యార్థులకు మంచినీటిని అందించడం కోసం ముందుకొచ్చిన దాత మహానందీశ్వర్ సేవను ఎప్పటికి గుర్తించుకుంటామన్నారు. కార్యక్రమంలో బసంత్, రామస్వామి, సురేఖ, కృష్ణయ్య, నారాయణ, శ్రీను, గోపి, జగదీశ్, నర్సింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన అధికారులు



నందిపాడ్‌లో వడగండ్లకు నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో సోమవారం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న పంటను మంగళవారం ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామకృష్ణ, ఏఈఓలు పరిశీలించారు. మద్దూరు మండలంలోని నందిపాడ్, జాదరాంపల్లి, మద్దూరు, చెన్వార్ గ్రామాల్లో దాదాపు 182 మంది రైతులకు చెందిన 350 ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని, నందిపాడ్‌లో కిరదోశ 5 ఎకరాల్లో, మద్దూరు మామిడి 20 ఎకరాల్లో నష్టం జరినట్లు ప్రాథమిక అంచాన వేసినట్లు ఏఓ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఉమ్మడి మద్దూరు మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలను పరిశీలించి రిపోర్టు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మహేష్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ చెల్లించాలని రోడ్డెక్కిన వృద్ధులు



రహదారిపై నిరసన చేస్తున్న పింఛన్‌దారులు

కోస్గిరూరల్: మార్చి నెల పూర్తి అవుతున్నా ఇప్పటి వరకు ఆసరా పింఛన్ డబ్బులు చెల్లించక పోవడంతో గుండుమాల్ మండల కేంద్రంలో వృద్ధులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఆసరా పింఛన్లపై ఆధారపడి ఎందరో బతుకుతున్నట్లు తెలిపారు. ఈ నెల చివరలో ఉగాది, రంజాన్ పండుగలు ఉండటంతో బతుకులు ఎట్లా గడిచేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

ముస్లింలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఊట్కూరు: రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం మహిళలకు మంగళవారం చిన్నపొర్ల గ్రామానికి చెందిన డాక్టర్ మక్బూల్ అహ్మద్ పాష చీరలు పంపిణీ చేశారు. ఊట్కూరులో 200 మందికి చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ నజీర్, డాక్టర్ మక్బూల్, అహ్మద్ మహబూబ్, అబ్దుల్ రజాక్, ఇలియాజ్ పాల్గొన్నారు.